# భ్రమ

శ్రీ

పంచవటి సుబ్రహ్మణ్యం.

★

ఆనాడు నేను బెజవాడ రైలుస్టేషను చేరుసరికి రైలుబండీ బయలుదేరు సమయమైంది. నా స్వప్రయాస వలనను, ఒక ముసలి పోర్టరు సహాయము వలనను, తుదకు బండిలో నెక్కగలిగాను. అది మొదటి తరగతి కంపార్టుమెంటు, హాయిగా, అంతా ఖాళీగా వున్నది. నేను కూర్చొనకమునుపే బండి కదిలింది.

'కొంచెమాలస్యమయితే బండి తప్పిపోయేది కదా' అనుకున్నాను. ఒక గంటవఱకు బండి ఎక్కడా ఆగదని తెలుసు. దూరపు ప్రయాణము గనుక, నా పరుపు పరుచుకొని, పెట్టె సర్దుకున్నాను. ఏమియు తోచక సుదర్శనుడు వ్రాసిన వుత్తరమును దీసి చదువుచుంటిని.

సుదర్శనుడును, నేనును, చిరకాల మిత్రులము. ఇరువురు ఒకేస్కూలులో విద్య నభ్యసించితిమి. ఆ దినములలో మేమొకరిని విడిచి యొకరుండు వారము గాము. కాలేజిలో చదువుచున్నప్పుడు కూడ, హాస్టలులో యిరువురు నొకే గదిలో యుండువారము. మా స్నేహమును జూచి యితరుల సూయ పడుచుండు వారు. ఇప్పుడతడు M. B. B. S. రాయవేటలో ప్రాక్టీసు (practice). తన వివాహమున కాహ్వాన పత్రిక సంపుచు, ఒక వారమునకు ముందే రమ్మని వేరుగా యుత్తరము వ్రాసినాడు. అతనివద్దకే నే నిప్పుడు పోవునది. ఆనాడు జూన్ 10వ తేది. 16వ తేదిని. అతని వివాహం.

రైలు చాలా వేగముగా పోవుచుండెను. తెనాలి దాటింది. ఒక చిన్న way-side station లో బండి ఆగింది. నేనున్న carriage తలుపు తెరువబడింది. ఒక చక్కని యువతి, ఆమెవెంట నొక యువకుడు బండిలో ఎక్కారు.

"మంచిదే, మనకు హాయిగా ఉంది," అన్నాడా యువకుడు. ఇద్దరూ సర్దుకు కూర్చున్నారు. నేనున్నానని తెలిసికూడ, వారు నన్నంతగా గమనించలేదు.

ఆ అమ్మాయికి 18 సంవత్సరాలుండవచ్చును. వాయు స్పర్శవలన వృక్షశాఖలు మృదువుగ కదలుచుండుటచే, ఆనందము ఆమె తలమీద ప్రేమ పుష్పాలను కురిపిస్తున్నది. మంచి ఏపైన మనిషి. పొడుగుగా, పచ్చగా, అందంగా ఉంది. తెలివితేటలతో కళకళలాడే ఆమె తీరైన వదనం, ప్రేమతో ప్రకాసించే నవ్వుకళ్లు, ఆరోగ్యంతోను, యౌవన బలంతోను నిగనిగ మెరిసే ఆమె మెత్తనిబళ్ళు, ఆ పెదవుల గులాబి రంగు, చెంపల నునుపు, భుజాల గుండ్రన, నడుమువంపు, అన్నీచూసి మురిసిపోయాను.

నీవు మురిసిపోతే మాకేమయ్యా అంటారేమో! అందుకే ముందుగా 'షరా'వేసి చెప్తున్నా–పొరపాటు బడకండి–అందఱికీ పుట్టేవికారం నాకేమీ పుట్ట లేదుగాని;–ఆ యౌవన ద్వయాన్ని జూచి ఆనందిస్తూ కూర్చున్నా. వారిద్దరూ ప్రేయసీ ప్రియులో, లేక నూతనముగ వివాహ మాడినవారో, నేను, మొదట నిర్ధారణ చేయ లేకుంటిని. వారు మాటలాడునది నేను వినగూడదనుకొంటినిగాని, నేనున్నానని వాళ్ళేమి లెక్క పెట్టలేదు.

ఈపెట్టె అంతా ఖాళీగా వారి అధీనంలోనుంటే ఎంత బాగుండేది?

"నెల్లూరు నీవెప్పుడూ రానట్టుంది" అన్నాడతను.

"లేదుగాని, ఎన్నాళ్ళుండవలసుంటుం దక్కడ" అన్నది ఆయువతి మృదు మధుర కంఠస్వరంతో.

"ఐదారురోజు లుండవల సుంటుంది. నీవు నాకు భార్య వైనందుకు యీ విషయంలో సహాయ పడెద

వనుకొందును. అక్కడనుండి యిక తిన్నగా Madrasకే పోవలసుంటుంది." అన్నాడు.

"అయ్యో-తప్పక, యీ విషయమై మీరు ప్రత్యేకించి చెప్పవలెనా?" అన్నది ప్రేమ పూర్వకంగా.

ఆ సంగతి అంతటితో పూర్తియైనది. తర్వాత వారు తమ చిన్నప్పటి అనుభవాలు, వివాహమునకు పూర్వము వారి అనురాగము, మొదలగు విషయముల గూర్చి ముచ్చటించుచు ఆనందించుచుండిరి. నెల్లూరు స్టేషనులో వారు దిగిపోయిరి.

ఉదయమే నేను మెడ్రాసు చేరుకొన్నాను. సుదర్శనుడు సెంట్రల్ స్టేషనులో నన్ను కలిసికొని, సగౌరవమున యింటికి తీసికొని పోయెను.

సుదర్శనుని యిల్లంతయు పెండ్లి ప్రయత్నములతో నిండియుండెను. అది రెండంతస్థులమేడ. చుట్టును పెద్ద కాంపౌండు, తోట, కలదు. మొదట రెండు రోజులును మేము మాపూర్వపు అనుభవములను జ్ఞాపకమునకు దెచ్చుకొని ఆనందించితిమి. ఇక పెండ్లి 3 రోజులున్నది. సుదర్శనుడు తనకు కాబోవు భార్యను గూర్చి ఎంతో ముచ్చటగా చెప్పుచుండువాడు. ఆమె మిక్కిలి అందమయినదనియు, ఆమెకు తప్ప యితరులకు తన హృదయమున తావులేదనియు, యిరువురును చిరకాలమునుండి ప్రేమించుచుండిరనియు, చెప్పుచుండెను.

"ఈ కాలపు స్త్రీలను నమ్మగూడదోయ్" అన్నాను పరిహాసంగా.

అతని ముఖము చిన్నబోయినది. "మోహన్, నీ వెన్ని చెప్పినను సుశీలను మాత్రమట్టి మాటనుట తప్పు. మా హృదయములు రెండును ఏకమయినవి. ఆమె నాకెట్టి మనః క్లేశమును గలిగింపదని నా దృఢ నమ్మకము" అన్నాడు.

"ఎంత ప్రేమగా నున్నను, ఒకవేళ వంచించినదనుకో, అప్పుడేమి చేయుదువు?" అన్నాను వింతగా అతని ముఖమువంక చూస్తూ.

"ఇంతగా ప్రేమించుచున్న నన్నామె మోసగించినచో, నామెపై దుఃఖముచే నేను మరణించవలసినదే" అన్నాడు జాలిగా.

ఆ సమయమున వేడికన్నీటి బిందువులు మా యిరువురి కండ్ల నుండియు రాలినవి!!

* * *

మరునాడు పెండ్లి వారు దిగారు. ఇల్లంతా హడావిడిగా యున్నది. నేను మేడమీద బాల్కనీలో పచారు చేస్తున్నా, ప్రకృతి దృశ్యాన్ని చూసి ఆనందిస్తూ. వెనుకనుండి ఎవరో వచ్చుచున్నట్లుండ, అటు దిరిగి చూచితిని. సుదర్శనుడు వచ్చుచుండెను. అతని ముఖములో ఆత్రము, ఆనందము, ప్రేమ, తాండవమాడుతున్నవి. తన భార్య సుశీలను నాకు పరిచయము చేయుటకతడచ్చటకు వచ్చెను. అతి సంతోషమున నన్నతడు వెంట గొనిపోయెను.

క్రింది హాలు ప్రక్కగా నున్న గదిలో ఒక యువతి కూర్చుండి యుండెను. "సుశీలా, యీతడు మోహనరావు. నా చిరకాలపు యనుంగు మిత్రుడు" అని యామెతో చెప్పుచు నన్ను చూపుచుండెను.

ఆ యువతిని చూడగానే నాకు గలిగిన ఆశ్చర్యం యింతింత గాదు. నేను తెల్లబోతిని; దేహము వణుకెత్తినది. ఎందుకు?? ఆమె మరెవరును గాదు-, ఆనాడు నేను రైలులో చూచిన యువతియే. నాకు బాగుగా జ్ఞాపకమున్నది. ఆ పచ్చని శరీరం, మెలికలు తిరిగిన ఆ జుట్టు, ప్రేమ పూరితమయిన ఆ కళ్లు, నేను మరువలేదు. ఆ యువకునకును నామెకు జరిగిన సంభాషణ నా చెవులలో యిప్పుడు ప్రతిధ్వనించుచున్నది. సుదర్శనుడింత గాఢముగా ప్రేమించుచున్న స్త్రీ యీమెయా? నేనాశ్చర్యంతో ఏమియు మాట్లాడలేక పోయాను. నా యుద్దేశ్య మేమియు తప్పుగాదు. ఈమె తప్పక ఆనాడు నాతో ప్రయాణము చేసిన స్త్రీయే!

నా దిగ్భ్రమ జూచి వారిద్దఱు తెల్లబోయి నవ్వుచుండిరి. నన్నుచూడగానే ఆమె ముఖములో ఏవిధమయిన మార్పును కనుపించలేదు. ఆమె సహజంగా చిరునవ్వు నవ్వుతూ ఉంది. నాకప్పుడేమి చేయుటకును తోచక, తల నొప్పిగా యున్నదని చెప్పి, అచ్చోట నుండియావలకు వచ్చితిని.

నేనేమి చేయవలెను? ఈ విషయం సుదర్శనునకు చెప్పవలెనా, వద్దా? చెప్పకున్న ఎట్లు? తెలిసియు, స్నేహితున కొకరు ద్రోహము చేయుచుండుట జూచి యూరకుందునా? ఆనాడు రైలులో జూచిన యువకు డెవడు? అతడు యీమె భర్త కాకున్న ప్రియుడా? ఎట్లయినను, హృదయమున యింత కపటముంచుకొని ఎంత ధైర్యముగ వచ్చినది? ఇట్లాలోచించు సమయమున సుదర్శను డనాడాడిన మాటలు జ్ఞప్తికి వచ్చినవి.

—"తన నింతగా ప్రేమించుచున్న నన్నామె మోసగించినచో, నామెపై దుఃఖముచే నేను మరణించవలసినదే!"—

అయినను అతనికీ సంగతి తప్పక తెలియవలెను. దీనివలన అతని నాశనమునకు నేను కారణ మగుదును, అయినను తప్పదు. ఇట్లాలోచించుచుండ సుదర్శను డచ్చటకు వచ్చెను.

"మోహన్. యిప్పుడు నీదేహస్థితి ఎట్లున్నది? నెమ్మదిగా యుండిన లేచి రమ్ము. బీచికి పోవుదము సుశీల కూడా వచ్చును" అన్నాడు.

"నేను రాలేను బ్రదర్, క్షమించు," అన్నాడు. అతడు నిరుత్సాహంతో వెళ్ళిపోయెను.

నేనెంతోసేపు దీర్ఘాలోచనచేసి తుదకిట్లా తీర్మానించుకొన్నాను. సుశీలను గలసి, స్వయముగా నాకామె చరిత్ర యంతయు తెలియునని చెప్పివేయవలసినది. తర్వాత ఆమెకు తగిన రీతి చెయ్యమనవలసినది. అంతే.— అదృష్టవశమున ఆ రాత్రే ఆమెను చూడ వీలుగలిగింది.

"సుశీలా, నన్ను నీవిది వఱకే గుర్తించి యుందువను కొందును." అన్నాను. నా ముఖము ఆశ్చర్యముతో దిలకించి, "లేదు, మిమ్మిదివరలో చూచు భాగ్యము నాకు గలుగలేదు" అన్నది సుశీల.

నేను తెల్లబోతిని. క్రోధము నన్నావరించినది. ఆమెను తీవ్రముగా జూచుచు "కాని, నిన్నెఱుగుదును," అన్నాను.

సుదర్శను డాసమయమున అచ్చటకు వచ్చుటచే, యీ విషయమై యిక మాట్లాడుటకు వీలుగలుగలేదు. అట్లు నే నొకవేళ చెప్పినను, నన్ను వారు నమ్మరు. ఎవరినో జూచి యిట్లు పొరబడు చున్నానని పరిహాసము చేయుదురు. కాన నా యుద్దేశ్యము తప్పుగాదు. సరియని నా హృదయమునకు బాగుగా తెలియును.— తిరిగి ఆమెను జూచి జరిగిన వృత్తాంతము తప్పక చెప్పవలె ననుకొన్నాను. బుధవారం పెండ్లి ఆరోజు ఆదివారం.

సోమవారమంతా వృథాగా గడిచిపోయింది. ఆమెతో మాట్లాడుటకు నాకు వీలు దొరకలేదు. మరునాడింకొక యోచన తట్టినది. బల్లమీద నున్న ఆంధ్ర పత్రికతీసి, 'నెల్లూరు' అను హెడ్డింగు గల కాలంను (column) ఆమెచే చదివించి, ఆమె ముఖభావాలెట్లు మారునో కని పెట్టవలెనని ఆమెనది చదువమంటిని. దాని నామె సహజముగ చదివినది గాని, ఆమె ముఖములో యేవిధమయిన మార్పు నాకు గోచరించ లేదు.

"ఏమి? నెల్లూరులో ఎవరున్నారు? అన్నాడు సుదర్శనుడు.

"నీకు ద్రోహము చేయదలచిన వారెవరో అక్కడున్నారులే," అన్నాను కొంచెం కోపంగా వారిరువురి వంకను జూచుచు–

నామాటలు వారికేమీ అర్థం కాలేదు. వారు తెల్లబోయి నావంక వింతగా జూచుచుండిరి. నేనచ్చట నుండి పోవుచుండ వారిట్లు నెమ్మదిగా మాట్లాడుకొన్నారు.

సుశీల:–"నీ స్నేహితునకు మతి సరిగా లేనట్లున్నది?"

సుదర్శనుడు:–"లేదు– అతడు చాలా తెలివిగలవాడు. రెండుమూడు దినములుగ అతని దేహస్థితి బాగుండలేదు. అతని మాటలు నాకును అర్థమగుట లేదు.

* * *

కాలం గడిచిన కొలది నా మనస్సులో బాధ ఎక్కువయింది. ఈ గూఢ రహస్యమును బయలుపెట్టే విధమెట్లా? ఈ విషయం సుదర్శనుని తల్లికి తెలియపరచిన? ఆమె నమ్మదు. ఇంకను గట్టిగా చెప్పిన, నేనేదో మధ్య కుట్ర చేస్తున్నానని తప్పుగా భావించును. తెలియపరచకున్న మిత్రద్రోహము చేసిన వాడనగుదును; చెప్పిన ఎవరునూ నమ్మినట్లు లేదు. తుదకిట్లు తీర్మానించుకొంటిని. పరిస్థితులెట్లు మారినను, తప్పక యీ రహస్యం బయలుపెట్టి, యీ కపట వివాహం జరుగనివ్వను. సుశీల ఎంత మాయమనిషి! తన గుట్టు బయటపడినా, దానిని కప్పివేయ మార్గ మిదివరకే ఆలోచించి యుండును. ఎట్లయినను ఆమె ఆట లిక సాగవు!

నాకా నాడేమియు తోచలేదు. ప్రపంచమంతయు యీ ఒక విషయముగా నాకు తోచుచుండెను ఆ దినము నా మనసు పొందిన బాధ యింతింత గాదు.

ఆ సాయంత్రమే సుదర్శనుని ఒంటరిగా చూడగలిగాను. అతనితో యీ సంగతి ముందు చెప్పవలెననుకొన్నాను.

"సుదర్శన్, నీవానాడు నాతో చెప్పిన మాటలు వాస్తవమా? నీతో ఒక గూఢ రహస్యం మాట్లాడదలచినాను. అందుకొరకడుగుచుంటిని" అన్నాను.

సుదర్శనుడు:–(ఆశ్చర్యముతో) ఏమాటలు, మోహన్?

"తన నింతగా ప్రేమించుచున్న నన్నామె మోసగించినచో, నాపై దుఃఖముచే నేను మరణించవలసినదే," యీ మాటలు నిజమేనా అని అడుగుతున్నాను.

సుదర్శన్:–(ఆశ్చర్యముతో) నిజమే, ముమ్మాటికి సత్యమే! ఎందుకిట్లు ప్రశ్నించుచున్నావు? మోహన్! అసలు సంగతేమిటి?

ఈ సమయమున సుశీల అచ్చటకు వచ్చి, సుదర్శనుని తల్లి అతనిని పిల్చుచున్నదని చెప్పెను. వెంటనే అతడు వెళ్లిపోయెను. సుశీలయు, నేనును మిగిలితిమి. ఇదే మంచి తరుణ మనుకొన్నాను.

"సుశీలా! పరిస్థితులు ప్రమాద మవక మునుపే, నీతో మాట్లాడవలె ననుకొన్నాను" అన్నాను.

ఆమె ఆశ్చర్యంతో నేనేమి చెప్పెదనోయని ఎదురు చూస్తున్నది.

"ఇక్కడ వేరెవరును లేరుగనుక, నీ నటన అంతా కట్టిపెట్టవలసింది. నిజంగా, నేను నిన్నెరిగినట్లే, నీవు నన్నెరుగుదువు" అన్నాను.

ఆమె ఏమియు జవాబివ్వక ఆశ్చర్యంతో నన్ను తీవ్రంగా చూచింది.

"నీవు, నిజము చెప్పెదవని నాకేమియు నమ్మకం లేదుగాని, అయినను అడిగెదను. బహుశః జూన్ 10వ తేది నీకు జ్ఞాపకముండవచ్చును?" అన్నాను.

"మీ కేమయినా మతిపోయినదా ఏమి? నన్నిట్లు ప్రశ్నించుటకు మీకెట్టి యధికారమును లేదు అయినను చెప్పుచున్నాను. జూన్ 10వ తేది నాకు బాగా జ్ఞాపకమున్నది" అన్నది తీవ్రంగా చూస్తూ.

నాకునూ బాగా జ్ఞాపకమున్నది! ఇట్టి కపట వివాహము జరుగుచుండ, చూచి యూరకుండు నను కొంటివా ఏమి?" అన్నాను.

అమెకు మితిలేని కోపము వచ్చినది. ముఖమెఱ్ఱబారినది. "మోహన్ రావ్, యిక జాగ్రత! పరిహాసమున కంతున్నది సుమా?"

"పరిహాసమున కంతున్నదిగాని, నీ మోసమున కంతులేనట్లున్నది. జూన్ నెల 10వ తేది నీవును యింకొక యువకుడును రైలులో ప్రయాణము చేయుటయు, మీ కెదురుగ నేను కూర్చుండుటయు, అతడు నిన్ను భార్యగా పిలుచుటయు, మీ సంభాషణయు, నేను మరచితి ననుకొంటివా? ఇక నీ కుట్ర సాగదులే!"

ఆమె ముఖమున మొదట మిక్కిలి ఆశ్చర్యము గనపట్టినది. వెంటనే, అది మారి చిరునవ్వు దాని స్థానమాక్రమించుకొన్నది. నేనింకను మాట్లాడ వలెనను కొంటి గాని, ఆమె నెవరో పిలుచుట వలన వెళ్లిపోయినది. పెండ్లికి బంధువులెవరో వచ్చినట్లును, అందువలన ఆమెను పిలిచినట్లును గ్రహించితిని. ఇక యీ పెండ్లే ఉండదులే! ఈ విషయము బయలు పడగానే, నన్ను వెనుక అందరూ మెచ్చుకుందురేమో గాని, ముమ్ముందు దూషింతురు. సంతోషమున నున్న వారందరూ విచారమున మునుగుదురు. అని యిట్లాలోచించు సమయమున సుశీలనవ్వుతూ నావద్దకు వచ్చినది.

"మోహన్ రావుగారూ! నా విషయమై మీరు చాలా శ్రమపడుచున్నట్లున్నారు, పాపం! మిమ్ము భోజనమునకు పిలుచుటకే నేనిప్పుడు వచ్చినది."

ఆమె మందహాసము జూడ నా కసహ్యమయినది. ఏమియు జవాబు చెప్పక ఆమే వెనుకనే లోపలకు పోతిని. మధ్య హాలునుండి కేకలు నవ్వులు, వినవచ్చుచుండెను. నేనచ్చటికి రాగానే, ఏమని చెప్పుదును? నా ఆశ్చర్యమున కంతులేదు. నా యెదురుగా యింకొక సుశీల ప్రత్యక్షమయినది! ఒక స్త్రీ, అదే కళ్ళు, అదే ముఖము, అదే జుట్టు, అదే చిరునవ్వుతో, నా కండ్లకు కనిపించుచున్నది. ఇది భ్రమయా, నిజమా, అని సందేహపడ్డాను. నా ఆశ్చర్యం చూచి అక్కడున్న వారంతా వింతపోయారు:

అప్పుడు సుశీల నవ్వుతూ, నన్నా నూతన స్త్రీ వద్దకు గొనిపోయి, ఆమె తన అక్కయనియు, వారిరువురును కవల పిల్లలనియు, రెండు నెలల క్రిందటనే ఆమెకు వివాహ మయినదనియు, తెలియ జెప్పినది. నేను తెల్లబోయి, ఏమియు మాట్లాడలేకుంటిని. ఈ సమయమున ఒక యువకుడు-అతనతడే! ఆనాడు నేను రైలులో చూచినతడే అచ్చోటకు రాగా, ఆయన తన బావయని నాకెరుకపరచెను. సుశీల నన్ను బయటికి గొనిపోయి, నవ్వుచూ-

"మోహన్ రావుగారూ, మీరాడిన నాటకమంతయు, వట్టి భ్రమయని యిప్పుడు గ్రహించియుందురు. గాని, మీ యందెట్టి తప్పును లేదు. మీ స్థానములో మరెవరుండినను యిట్లే గోలచేసి యుందురు. జూన్ నెల 10వ తేది సంగతి నాకిప్పు డర్థమయినది. ఆనాడు నా బావ, అక్క, నెల్లూరుకు వచ్చియుండిరి. వారానాడు మీతో ప్రయాణముచేసిరనియు మా అక్కను జూచి, నేనే యామె యని భ్రమపడితిరనియు తెలియుచున్నది."

"సుశీలా, నాతప్పును క్షమించవలెను. నీకెంతనో మనస్సంకటము గలిగించితిని."

ఆమె నవ్వుచూ "మీరు చేసినపనికి చాలా సంతోషిస్తాను. దీనివలన మీకు నాభర్తపై ఎంత అనురాగమున్నదో తెల్లమగుచున్నది."

"అయినను, యీ సంగతి యితరుల కెఱిగింపవలదని నా ప్రార్థన"

"అట్లే కానిండు, మా అక్కకును, నాకును యిట్టి పొరపాట్లనేక మార్లు జరిగినవి. కాని యీ విషయం నే నెవరితోనూ చెప్పను."

ఆమె అట్లే ఎవరితోనూ చెప్పలేదు—ఏ రోజు విచారమున మునుగు ననుకొంటినో, ఆ దినమున సుదర్శను నిల్లంతయు అలంకారములతోను, మేళ వాద్యములతోను శోభిల్లుచుండెను. సుశీలా, సుదర్శనుల వివాహము అతి వైభవమున జరిగెను. వివాహమయిన మూడవదినమే సుదర్శను ననుమతి పొంది ఊరికి బయలుదేరితిని.

రైలుబండి బహు వేగమున పరిగెత్తుచుండెను. చల్లగాలి జోరుగా వీచుచుండెను. మేలుకొని కూర్చున్న తిరిగి ఏదో భ్రమపడెద ననుకొని, కాన్పూరు శాలవ కప్పుకొని వెచ్చగా పడుకొన్నా.


## జీవబ్రహ్మైక్య రాజయోగ సారామృతము

ఇది కడప శ్రీపరమహంస సచ్చిదానంద యోగీశ్వరులవారిచే ముద్రింపబడినది.



1276-పుటలు, 48-పటములుగలది, మూడవ కూర్పు.

| | | |
|---|---|---|
| కాలికోబయిండు | రూ. | 4-4-0 |
| గూఢార్థ సంగ్రహ సహిత శ్రీ భగవద్గీత | రూ. | 2-4-0 |
| శ్రీ కబీర్ దాసు చరిత్రము | రూ. | 2-4-0 |
| శరీరదేలయ రహస్యార్థపారిజాతము | రూ. | 0-6-0 |

## చిత్రగుప్త ఆఫీసు

సౌకారుపేట పోస్టు, మదరాసు.